సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



ఆలయ నిర్మాణానికి విరాళం

గోకవరం: శ్రీ స్కంద బాలాజీ సూర్య దేవాలయం నిర్మాణానికి రాయరపురెడ్డి నారాయణ రావు తన తల్లి వీరవేణి పేరిట శనివారం రూ.1,18,118 విరాళంగా అందజేశారు.




నంబర్ వన్ దిశగా ఇస్రో

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా శ్రీహరికోట షార్ ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో పలువురు విద్యా రంగ ప్రముఖులను శనివారం సత్కరించారు.

8 లో

డెల్టాలకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం గోదావరి తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు చేరింది.

- అంతరిక్షంపై అవగాహనకు వారోత్సవాలు
- రాజమహేంద్రవరం వేదికగా శ్రీకారం
- ఖగోళ వింతలపై విద్యార్థుల ఆసక్తి
- వేడుకలకు ఇస్రో సారథ్యం

అనగనగా ఆకాశం ఉంది



నాన్నా.. ఆకాశం నీలంగా ఎందుకు ఉంటుంది.. చుక్కలు రాత్రి ఎందుకు వస్తాయి.. ఆకాశంలో ఎవరున్నారు.. చందమామ మీద లైట్లు ఉన్నాయా.. ఇలాంటి ప్రశ్నలు ఏడేళ్ల అన్వేష్ నుంచి తండ్రికి అప్పుడప్పుడు ఎదురవుతూంటాయి. కొద్దోగొప్పో చదువుకున్నా అన్వేష్ తండ్రికి వాటి గురించి ఆ చిన్నారికి వివరించే పరిజ్ఞానం లేదు.. దీంతో ఏదో ఒకటి చెప్పి సమాధానపరిచేస్తూంటాడు. బాల్యంలో చాలా మందికి ఆకాశం వైపు చూడగానే ఎన్ని సందేహాలో.. మరి ఎలా తీరుతాయి.. చెప్పాల్సిన తల్లిదండ్రులకూ తెలియదాయె.. ఈ నేపథ్యంలోనే అంతరిక్ష వారోత్సవాలు జరుగుతున్నాయి. సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులకు అంతరిక్షంపై కనీస అవగాహన కల్పించేందుకు ఇవి దోహదపడతాయి.

చిన్నప్పటి నుంచీ ఎంతో ఇష్టం



నేను ఇంటర్మీడియెట్ చదువుతున్నాను. చిన్నప్పటి నుంచీ అంతరిక్షంపై ఆసక్తి. నా అభిరుచిని అమ్మానాన్నలు గుర్తించి ప్రోత్సహించారు. ఎన్సైక్లోపీడియాలో అంతరిక్ష విశేషాలు చదివేదాన్ని. ఆరో తరగతి నుంచే ఈ రంగంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనేలా ఇంట్లో ప్రోత్సహించేవారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో బహుమతులు గెలుచుకున్నాను. నా ఉత్సాహాన్ని గమనించి స్పేస్ పోర్ట్ ఇండియా ఫౌండేషన్‌లో శిక్షణకు జాయిన్ చేశారు. బృహస్పతి, అంగారక గ్రహాల మధ్య మెయిన్ ఆస్టరాయిడ్ బెల్ట్‌లో 2020 పీఎస్ 24 అనే అస్టరాయిడ్‌ను గుర్తించాను. దీనికి నాకు నాసా నుంచి ధ్రువపత్రం వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలతో పాటు రూ.లక్ష రివార్డు ప్రకటించడం ఎంతో ఆనందం కలిగించింది. టెన్త్ చదువుతూండగా మరో ఆస్టరాయిడ్ 2021 సీఎం 37ను గుర్తించి నాసా ధ్రువపత్రం అందుకున్నాను. ఇస్రో ఏటా నిర్వహించే అంతరిక్ష వారోత్సవాల పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాను.

– కైవల్యారెడ్డి, నిడదవోలు

స్పేస్ సైంటిస్టు కావాలన్నదే మా లక్ష్యం



నేను ఇంటర్మీడియెట్, తమ్ముడు ఉజ్వల్ తొమ్మిదో తరగతి చదువుతున్నాం. ఎప్పటికైనా స్పేస్ రంగంలో సైంటిస్టులుగా పని చేయాలనుంది. మా ధ్యాస అంతా అంతరిక్షం పైనే ఉంది. ఈ విషయంలో మా అమ్మానాన్నల ప్రోత్సాహం ఉంది. గత ఏడాది స్పేస్ పోర్టు ఇండియా ఫౌండేషన్ సంస్థలో శిక్షణ పొందాం. ఇస్రో పోటీల్లో మా ప్రాజెక్టు బహుమతి పొందింది. గతంలో స్పేస్ కాలనీ ప్రాజెక్టు నిర్వహించిన నాసా స్పేస్ కాంటెస్ట్‌కు ఎంపికయ్యాం. అదే సమయంలో ఓ గ్రహ శకలాన్ని గుర్తించాం. మా ప్రయోగానికి '2021–పీఆర్66' గుర్తింపు లభించింది. టెక్సాస్‌లోని హార్టిన్– సీమన్స్ విశ్వ విద్యాలయంతో పాటు ఇంటర్నేషనల్ ఆస్ట్రోనామికల్ సెర్చ్ కొలాబరేషన్ (ఐఏఎస్‌సీ) నుంచి కూడా సర్టిఫికెట్లు వచ్చాయి.

– రిషిక్, ఉజ్వల్, దొమ్మేటివారివీధి, అమలాపురం

మనం..ఘనం

- 1975 ఏప్రిల్ 19న మన దేశం తొలి ఉపగ్రహం ఆర్యభట్టను రష్యా నుంచి ప్రయోగించింది.
- 1980లో శ్రీహరికోట నుంచి ఎస్ఎల్‌వీ ద్వారా రోహిణి–1 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. మన దేశం నుంచి ప్రయోగించిన తొలి ఉపగ్రహమిది.
- 1984 ఏప్రిల్ 3న మన దేశానికి చెందిన తొలి వ్యోమగామి రాకేష్‌శర్మ సోయజ్–2 రాకెట్ ద్వారా మరో ఇద్దరు రష్యన్లతో కలిసి అంతరిక్షంలో అడుగు పెట్టారు.
- 1992లో ఆగ్మెంటెడ్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఏఎస్ఎల్‌వీ) ప్రయోగం విజయవంతం కావడం మన శాస్త్రవేత్తల్లో కొండంత బలాన్ని నింపింది.
- రక్షణ, విద్య, వ్యవసాయ రంగాలకు సంబంధించి ఎంతో ఉపయోగపడే పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్(పీఎస్ఎల్‌వీ)ను 1994లో ప్రయోగించాక మన దేశం ఇక వెను తిరిగి చూడలేదు.
- 2001లో మరింత శక్తిసామర్థ్యాలను మరింతగా కూడగట్టుకునేలా జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ) నిర్మాణానికి శ్రీకారం చుట్టి, ఏకంగా 5 వేల కిలోల బరువున్న ఉపగ్రహాలను కూడా నింగిలోకి పంపే స్థాయికి చేరింది.
- 2022లో అత్యాధునిక స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) ప్రయోగం విజయవంతమైంది. ఇది ఎన్నో ఉపగ్రహాలను నింగికి మోసుకు వెళ్లింది.
- ఈ ఏడాది ఆగస్టులో చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా దిగడం అంతరిక్ష ప్రయోగాల్లో సరికొత్త చరిత్రను సృష్టించింది.
- ఈ క్రమంలోనే సూర్యునిపై అధ్యయనానికి ఈ ఏడాది సెప్టెంబర్ 2న 'ఆదిత్య ఎల్–1' ప్రయోగం చేపట్టింది. దీని విజయం కోసం భారత్ సహా ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

(డెస్క్–రాజమహేంద్రవరం)

అంతరిక్షం గురించి పూర్తిగా తెలియకపోయినా ప్రాథమిక విషయ పరిజ్ఞానమైనా అందరికీ ఉండాలని ఇస్రో భావిస్తోంది. ఇందులో భాగంగానే ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకూ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని నాలుగు నగరాలను ఇందుకు ఎంపిక చేసింది. ఇందులో రాజమహేంద్రవరం కూడా ఒకటి. స్పేస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ థీమ్‌తో ప్రైవేటు భాగస్వామ్యంతో ఈసారి వారోత్సవాలను నిర్వహిస్తోంది. మిగిలిన మూడు నగరాల్లో అన్ని సౌకర్యాలూ ఉన్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో చేస్తూండగా మన రాజమహేంద్రవరంలో మాత్రం వీటిని ప్రజల మధ్య నిర్వహిస్తూండటం విశేషం. అందుకే ఇస్రో ఇక్కడే ఎక్కువ దృష్టి సారించింది. ఇప్పటికే రోజుకొక ప్రత్యేక కార్యక్రమాలతో ఆకట్టుకుంది. ఆనం కళాకేంద్రంలో ప్రదర్శనాంశాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. అంతరిక్షానికి సంబంధించి క్విజ్ పోటీలు నిర్వహించింది. విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్ ఎస్ విజయకుమార్ చెప్పారు. వారోత్సవాల్లో చిన్నా పెద్దా అందరికీ భాగస్వామ్యం కల్పిస్తున్నామన్నారు.

సండే స్పెషల్

ఏమిటీ వారోత్సవాలు!

నాటి సోవియట్ యూనియన్ (రష్యా) 1957లో తొలి మానవ నిర్మిత ఉపగ్రహం స్పుత్నిక్‌ను ప్రయోగించి, అంతరిక్ష అన్వేషణకు శ్రీకారం చుట్టింది. 1967 అక్టోబర్ 10న చంద్రునితో సహా ఇతర ఖగోళ ప్రాంతాల్లో పరిశోధనకు సంబంధించిన కార్యకలాపాల ఒప్పందంపై వివిధ దేశాలు సంతకాలు చేశాయి. అందులో మన దేశమూ ఉంది. అక్టోబర్ 4 – 10 తేదీల మధ్య ఈ చారిత్రక సంఘటనలు చోటు చేసుకోవడంతో ఈ రెండు తేదీల మధ్య ఉన్న కాలంలో అంతరిక్ష వారోత్సవాలు జరపాలని ఐక్యరాజ్య సమితి 1999లో నిర్ణయించింది. అంతరిక్ష విజయాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న ఇస్రో మన దేశంలో ఈ వేడుకలకు నేతృత్వం వహిస్తోంది.

నింగి వైపు దూసుకు వెళుతూ..

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే మన దేశం అంతరిక్ష రంగంపై దృష్టి పెట్టింది. ఇందుకు అంతరిక్ష రంగ పితామహుడు విక్రమ్ సారాభాయి అచంచల కృషి తోడయ్యింది. ఫలితంగా 1962లో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చి (ఇన్‌కోస్పార్) ఆవిర్భవించింది. తర్వాత ఉపగ్రహాల ప్రాధాన్యాన్ని గుర్తించి, కేరళలోని త్రివేండ్రం వద్ద రాకెట్ లాంచింగ్ స్టేషన్‌కు శ్రీకారం చుట్టింది. మొదట్లో అమెరికా, రష్యాల నుంచి దిగుమతి చేసుకున్న రాకెట్లపై అధ్యయనం జరిగేది. సైంటిస్టుల ప్రతిభతో కొద్ది కాలంలోనే దేశీయంగా రాకెట్లను తయారు చేసే స్థితికి మన దేశం అభివృద్ధి చెందింది. 1969లో ఇన్‌కోస్పార్ కాస్తా ఇస్రోగా మారింది. మరో మూడేళ్ల తర్వాత అంతరిక్ష ప్రత్యేక విభాగం ఏర్పడింది. ఇలా స్వాతంత్ర్యం సిద్ధించిన రెండు దశాబ్దాలకే అంతరిక్ష రంగంలో మనం అగ్రదేశాల సరసకు చేరగలిగాం. ఓటములెదురైనా మన శాస్త్రవేత్తలు నిరాశ చెందకుండా వైఫల్య పాఠాలే విజయానికి పునాదిరాళ్లుగా మలచుకుని అంతరిక్ష రంగంలో ప్రపంచమే నివ్వెరపోయే స్థితికి మన దేశాన్ని నడిపించారు. ఈ ఏడాది చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో అగ్రదేశాలను దాటుకుని సగర్వంగా ముందుకు దూసుకుపోయింది.



రాజమహేంద్రవరంలో అంతరిక్ష ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

రెడ్‌క్రాస్‌ను మరింత పటిష్టం చేద్దాం : కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రెడ్‌క్రాస్ ద్వారా ప్రజోపయోగ కార్యక్రమాలను చేపట్టి, సంస్థను మరింత పటిష్టం చేద్దామని కలెక్టర్, ఐఆర్‌సీఎస్ అధ్యక్షురాలు మాధవీలత పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీలో మరింత మందిని సభ్యులుగా చేర్పించి కార్యకలాపాలు విస్తరించాలని సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు మేలు చేసే, సామాజిక చైతన్యాన్ని నింపే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యత్వాలను పెంచడానికి జిల్లాస్థాయిలో జూనియర్ అండ్ యూత్ ఐఆర్ఎస్ సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థి విభాగంలో జేఆర్‌సీ రూ.20, వైఆర్‌సీ రూ.30తో సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. అనంతరం గత ఏడాదిగా రెడ్‌క్రాస్ సొసైటీ చేపట్టిన కార్యక్రమాలపై సమీక్షించారు. ఇకపై ప్రతి శనివారం రెడ్‌క్రాస్ కార్యక్రమాలపై సమీక్షిస్తామని మాధవీలత తెలిపారు.

జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రూ.9 లక్షలతో కొనుగోలు చేసిన అంబులెన్స్‌ను కలెక్టర్ మాధవీలత ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ వై.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ఈ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. దీనికి ఒక టోల్ ఫ్రీ నంబర్ కేటాయిస్తామన్నారు. మరణించిన వ్యక్తుల అంతిమయాత్ర కోసం ఈ వాహనాన్ని ఉచితంగా అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు, కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి, ట్రెజరర్ సునీల్, వైస్ చైర్మన్ దాల్ సింగ్, ఎంసీ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు, జీఎస్ మహాలక్ష్మి, లంకా సత్యనారాయణ, కె.శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

మట్టి అమ్ముకుని.. దేవుడికి రూపాయి కూడా కట్టరా!

- స్వామివార్ల భూముల స్వాహాపై అమలాపురం ఆర్‌డీఓ సీరియస్
- బకాయిలు చెల్లించకుంటే కౌలు రద్దు చేస్తామని హెచ్చరిక

సాక్షి ఇంపాక్ట్

సఖినేటిపల్లి: 'స్వామివార్ల భూములు స్వాహా' శీర్షికన 'సాక్షి' శనివారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. క్షేత్ర స్థాయికి వెళ్లి వాస్తవాలను పరిశీలించారు. అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ భూముల బకాయిలకు సంబంధించి రావాల్సిన బకాయిలపై అమలాపురం ఆర్‌డీఓ వసంతరాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీలక్ష్మీ నృసింహస్వామి, నీలకంఠేశ్వర స్వామి దేవస్థానాల భూములను సాగు చేస్తున్న రైతులతో శిస్తులపై దేవస్థానం ప్రాంగణంలో శనివారం ఆయన సమీక్షించారు. ఈ దేవస్థానాలకు అంతర్వేది, శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం, గొంది గ్రామాల్లో ఉన్న భూముల శిస్తుల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో పెంపుదలపై చర్చించారు. లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి రూ.1,70,82,842, నీలకంఠేశ్వరస్వామి దేవస్థానానికి రూ.68,05,130 మేర బకాయిలున్న విషయాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వివరించారు. ఈ గ్రామాల్లో 152.35 ఎకరాలను అనధికారికంగా రొయ్యల చెరువులుగా మార్చి, సాగు చేస్తున్న అంశం కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. లీజులు తక్కువగా ఉన్నా బకాయిలు చెల్లించకపోవడాన్ని ఆర్‌డీఓ తీవ్రంగా పరిగణించారు. దేవస్థానం భూములను ఇష్టానుసారం చెరువులుగా మార్చేసి, మట్టి కూడా అమ్ముకుని, దేవుడికి రూపాయి కూడా కట్టడం లేదని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలల్లోగా బకాయిలు చెల్లించకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు నెలల్లో సగం బకాయిలు చెల్లించాలని, మిగిలిన మొత్తాన్ని వాయిదాలపై చెల్లించాలని ఆదేశించారు. మొండికేస్తే కొత్తగా వేలం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆస్తులున్నా ఆశించిన రీతిలో ఆదాయం రాక.. స్వామివారి కల్యాణ మహోత్సవాలకు వేర్వేరు విధాలుగా డబ్బులు తీసుకురావాల్సిన పరిస్థితులు సరి కాదని అభిప్రాయపడ్డారు. మూడేళ్లకోసారి శిస్తులు పెంచాల్సి ఉందని, రైతులు కష్టాల్లో ఉండటంతో పెంపుదలను వాయిదా వేయాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోరారు. దేవస్థానం భూముల్లో మట్టి అమ్మితే చట్టం ప్రకారం చర్యలు తప్పవని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ హెచ్చరించారు.

బంగారుకొండకు సీఎస్ ప్రశంస



సమీక్షలోపాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కలెక్టర్ మాధవీలత ప్రయోగాత్మకంగా చేపట్టిన బంగారు కొండ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి కితాబునిచ్చారు. జూన్‌లో చేపట్టిన ఈ కార్యక్రమం కింద 383 మంది పిల్లలు సాధారణ స్థితికి చేరుకోవడం అభినందనీయమన్నారు. శనివారం ఆయన న్యూఢిల్లీలోని ఏపీ భవన్ నుంచి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంలో బంగారుకొండ గురించి కలెక్టర్ వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో దీనిని చేపడుతున్నామన్నారు. 1283 మంది పిల్లలను బాలమిత్రలు ఆరు నెలలు పాటు సంరక్షిస్తారన్నారు. 6 నెలల నుంచి ఆరేళ్ల వయసులో రక్తహీనత, సరైన ఎదుగుదల లేని పిల్లలను ఇందుకోసం గుర్తించినట్లు పేర్కొన్నారు రానున్న రోజుల్లో ప్రజా ప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వామ్యం చేస్తామన్నారు. ఈ వివరాలు తెలుసుకున్న సీఎస్ కలెక్టర్ సారథ్యంలో బంగారు కొండను చక్కగా నడుపుతున్న బృందాన్ని అభినందించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. జగనన్నకు చెబుదాం కింద ఇప్పటి వరకు 8,613 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ పేర్కొన్నారు. వాటిలో 7,352 పరిష్కరించినట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కింద 82 మెడికల్ క్యాంపులు నిర్వహించి 39,255 మందికి వైద్య సేవలు అందించామన్నారు. 1878 మందిని తదుపరి వైద్య సేవలకు ఆరోగ్య శ్రీ ఆసుపత్రికి సిఫార్సు చేసినట్లు తెలిపారు.

గ్రామీణాభివృద్ధికి నాబార్డు దోహదం

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.చవాన్‌శ్యామ్‌రాజ్‌నాయక్



నాబార్డు జిల్లా మేనేజర్ వైఎస్ నాయుడ్ని సత్కరిస్తున్న వ్యవసాయకళాశాల అసోసియేట్ డీన్ డా.చవాన్‌శ్యామ్‌రాజ్‌నాయక్

రాజమహేంద్రవరం రూరల్: ఆర్థిక కార్యకలాపాలను మెరుగుపరచడానికి, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించి తద్వారా గ్రామీణాభివృద్ధికి దోహదపడేందుకు కేంద్ర ప్రభుత్వం నాబార్డును ఏర్పాటు చేసిందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్ రాజ్ నాయక్ పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలలో భాగంగా కాతేరులోని వ్యవసాయ కళాశాలలో అగ్రి క్లినిక్స్,అగ్రి బిజినెస్ సెంటర్స్ పెట్టడానికి అర్హతలు, నాబార్డ్ పాత్ర అనే అంశంపై శనివారం జరిగిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి నాబార్డు ద్వారా ఆర్థిక, ఆర్థికేతర అంశాల పరిష్కారాలను వివరించారు. నాబార్డ్ జిల్లా మేనేజర్ డాక్టర్ వై.ఎస్.నాయుడు మాట్లాడుతూ వ్యవసాయ కోర్సు విద్యార్థులకు అగ్రి క్లినిక్స్,అగ్రి బిజినెస్ సెంటర్స్ పెట్టడానికి అర్హతలు, నాబార్డ్ పాత్ర, విధి విధానాలు, ప్రభుత్వ సబ్సిడీ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే స్థాపించిన సంస్థల పురోగతి గురించి క్లుప్తంగా తెలియజేశారు. ఏపీ ఎల్‌పీఈ ఎన్‌జీవో సీఈవో ఫ్రాంక్లిన్ మాట్లాడుతూ ఎన్‌జీవో స్థాపించాలంటే మార్గదర్శకాలు, వ్యవసాయ విద్యార్థుల పాత్ర గురించి వివరించారు.ఈ సందర్భంగా నాబార్డు జిల్లా మేనేజర్ డా. వైయస్ నాయుడును సన్మానించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ దయాకర్, డాక్టర్ జీ రమేష్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఇంటర్ మార్కుల జాబితాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఇంటర్ పరీక్షలకు సంబంధించి మార్కుల జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని కళాశాలల యాజమాన్యాలు తీసుకుని వెళ్లాలని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ నరసింహం శనివారం ఒక ప్రకటనలో కోరారు. మార్కుల జాబితాలను సోమవారం స్థానిక ఇంటర్ బోర్డు కార్యాలయానికి వచ్చి తీసుకోవాలన్నారు. ఆయా జూనియర్ కళాశాలల తరఫున ఆఫీస్ సిబ్బంది ప్రిన్సిపాల్స్ ఆథరైజేషన్ లెటర్ సమర్పించి ఒరిజినల్ మార్కుల జాబితాలు కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు. ఆ జాబితాలను సంబంధిత విద్యార్థులకు అందజేయాలన్నారు.

8,415మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా 17 ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాల్లో సాయంత్రం సరికి 8,415మంది రోగులు వైద్యసేవలు పొందారని డీఎంఅండ్‌హెచ్‌వో డా.కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డా.మానిక తెలిపారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సర్వ సన్నద్ధం

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



దేవరపల్లి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా పండించిన ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు శనివారం తెలిపారు. జిల్లాలోని 18 మండలాల్లో మూడు దఫాలుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ లోగా పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను తెరుస్తామన్నారు. 10న ఆరు మండలాలు, 15న ఆరు మండలాలు, 20న మిగిలిన ఆరు మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు వివరించారు. జిల్లాలో 300 రైతుభరోసా కేంద్రాలుండగా, 231 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఖరీఫ్‌లో 4.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నట్టు మాధవరావు తెలిపారు. ఎక్కువగా స్వర్ణ రకం ఎంటీయూ– 7029ను రైతులు పండించారన్నారు. ఎంటీయూ– 7029 వంగడం 40 శాతం, పీఎల్ఏ– 1100 వంగడం 25 శాతం, ఇతర రకాలు 35 శాతం విస్తీర్ణంలో సాగు చేసినట్టు వివరించారు. పూర్తిస్థాయిలో ప్రొక్యూర్‌మెంట్‌కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ధాన్యం సేకరణకు గోనె సంచుల కొరత లేకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించడానికి మైత్రీ కమిటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మండల స్థాయి అధికారులు, సొసైటీ సీఈఓ, రైతు సంఘం ప్రతినిధులు ఇందులో సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రతి రోజూ ఈ కమిటీ ప్రతినిధులు నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తారని మాధవరావు చెప్పారు.



ఫల, పుష్పాలంకరణలో స్వామివారు

శ్రీ వేంకటేశం.. మనసాస్మరామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తజనవాహినిగా మారింది. ఏడు శనివారాల వ్రతం ఆచరించిన వారితో పాటు సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారి గోవింద నామోచ్చారణతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. స్వామివారిని యాపిల్ పండ్లు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు, పలు సేవలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ ప్రసాదాల విక్రయం, విరాళాల రూపంలో స్వామివారికి రూ.30,37,871 ఆదాయం సమకూరిందని ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



వాడపల్లి క్షేత్రంలో భక్తజనప్రవాహం

ప్రపంచంలోనే నంబర్ వన్ దిశగా ఇస్రో



సత్కారం అందుకున్న విద్యాసంస్థల ప్రముఖులు



ప్రదర్శనలను తిలకించేందుకు వేలాదిగా వచ్చిన విద్యార్థులు

- తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు
- విద్యాసంస్థల ప్రముఖులకు ఇస్రో బృందం సత్కారం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలుస్తుందనడానికి చంద్రయాన్ ప్రయోగం విజయవంతమే నిదర్శనమని తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు అన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా వివిధ విద్యా సంస్థల ప్రముఖులను స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శనివారం సత్కరించారు. వీరిని శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్, ఉత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఎస్.వి జయకుమార్ సారథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తల బృందం సత్కరించింది. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ, చంద్రయాన్ విజయవంతమైన సమయంలో ఉద్విగ్న క్షణాల మధ్య వీక్షించిన జనం ఆనంద బాష్పాలు రాల్చారని గుర్తు చేశారు. ఒకపక్క రష్యా పంపిన రాకెట్ విఫలమైన సమయంలో మరోపక్క ఇస్రో పంపిన చంద్రయాన్ విజయవంతం కావడం మన అదృష్టమని అన్నారు. చంద్రయాన్ విజయవంతానికి కృషి చేసిన ఇస్రో బృందాన్ని ఆయన అభినందించారు. శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్ విజయకుమార్ మాట్లాడుతూ, ప్రజల మధ్య నిర్వహిస్తున్న అంతరిక్ష వారోత్సవాలకు అద్భుత స్పందన లభిస్తోందని అన్నారు. స్పేస్ వాక్‌కు 3,500 మంది విద్యార్థులు హాజరు కావడం రికార్డని అన్నారు. ఉత్సవాల విజయంతానికి సహకరిస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజమహేంద్రి మహిళా కళాశాల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ ఏలేటి రవిబాబు, ప్రతిభ స్కూల్ డైరెక్టర్ ఎస్‌కేఎస్ఆర్‌సీ మూర్తి, అక్షరశ్రీ విద్యానికేతన్ డైరెక్టర్ టి.నాగరత్నం సత్కారం అందుకున్నారు. అంతరిక్ష ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలను వేలాదిగా విద్యార్థులు సందర్శించారు.

దక్షిణాఫ్రికాలో సత్తా చాటిన మండపేట కుర్రాళ్లు

- ప్రపంచ టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ
- చాంపియన్‌షిప్ గెలుచుకున్న భారత జట్టులో వినయ్, రామారావు



ప్రపంచ టెన్నికాయిట్‌లో ప్రతిభ చూపిన వినయ్, రామారావు

మండపేట: దక్షిణాఫ్రికాలో జరిగిన ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండపేట కుర్రాళ్లు సత్తా చాటారు. జర్మనీపై విజయంతో చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న భారత జట్టులో మండపేటకు చెందిన క్రీడాకారులు వడ్డాది వినయ్‌కుమార్, పిల్లి రామారావు ప్రాతినిధ్యం వహించారని కోచ్ కుంచే రమేష్ తెలిపారు. గత నెల 29 నుంచి శనివారం వరకూ ప్రపంచ టెన్నికాయిట్ పోటీలు జరిగాయన్నారు. శనివారం ఉదయం జరిగిన తుది పోటీలో జర్మనీపై భారత జట్టు గెలుపొంది చాంపియన్‌షిప్ కైవసం చేసుకుందన్నారు. భారత జట్టు తరఫున ఆడిన ఆరుగురిలో వినయ్, రామారావు కూడా ఉన్నారని చెప్పారు. సింగిల్స్ విభాగంలో వినయ్ 5, రామారావు 7, డబుల్స్‌లో ఇద్దరూ కలసి ఐదో స్థానం కైవసం చేసుకున్నారని రమేష్ తెలిపారు. వీరు ఆదివారం సాయంత్రం విశాఖపట్నం చేరుకుని, అక్కడి నుంచి ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు వైడీ రామారావు, కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ నేతృత్వంలో అసోసియేషన్ చైర్మన్, విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలుస్తారని చెప్పారు. అనంతరం వినయ్, రామారావు సోమవారం మండపేట చేరుకుంటారని రమేష్ తెలిపారు.

ఫలించిన దాతల ఆశయం

వినయ్‌కుమార్ తండ్రి తాపీ మేస్త్రి కాగా, రామారావు తండ్రి టైలరింగ్ చేస్తుంటారు. టెన్నికాయిట్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపి, అంతర్జాతీయ పోటీల్లో ఆడే జాతీయ జట్టుకు వీరు అర్హత సాధించారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అయ్యే ఖర్చుల నిమిత్తం వీరు అసోసియేషన్‌కు రూ.2.5 లక్షల వరకూ చెల్లించాల్సి ఉండగా.. ప్రతిభ ఉన్నా పేదరికం అడ్డంకిగా మారింది. సోషల్ మీడియా ద్వారా వీరి పరిస్థితి తెలుసుకున్న పట్టణానికి చెందిన దాతలు ముందుకు వచ్చారు. మే నెలలో లోకల్ చానల్ స్థానిక ఎంపీఎస్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని విరాళంగా అందజేశారు. వినయ్, రామారావులు దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుని, మండపేటకు మంచి పేరు తెచ్చారని స్థానికులు అభినందిస్తున్నారు.

వాడపల్లిలో అన్ని హంగులూ..

- త్వరలో బ్యాటరీ ఆటోలు
- దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ
- రూ.5.10 కోట్లతో వివిధ పనులకు శ్రీకారం
- పాల్గొన్న విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని సత్యనారాయణ దంపతులు తొలిసారిగా దర్శించుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాణరాజు ఆధ్వర్యాన అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామి వారి చిత్రపటం అందించారు. ఈ సందర్భంగా ఆయన భక్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాబోయే కాలంలో భక్తుల రద్దీని అంచనా వేసి, దానికి అనుగుణంగా ఎనిమిది ప్రముఖ దేవాలయాలు సహా అన్ని ఆలయాలనూ అభివృద్ధి చేసేందుకు ఈ మాస్టర్ ప్లాన్ ఉపయోగపడుతుందని అన్నారు. వాడపల్లి దేవస్థానాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు భక్తుల రద్దీకి అనుగుణంగా స్థల సేకరణ జరపాలని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి మంత్రి సూచించారు. బస్సు కాంప్లెక్సు నుంచి భక్తులు ఆలయానికి చేరేందుకు వీలుగా బ్యాటరీతో నడిచే ఆటోలు ఏర్పాటు చేస్తామన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. ఆలయ అభివృద్ధికి అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్ చాలా బాగుందని ప్రశంసించారు. వాడపల్లిలో త్వరలో దేవస్థానం కాటేజీలు కూడా ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో వాడపల్లి అభివృద్ధికి చర్యలు చేపట్టామని మంత్రి సత్యనారాయణ చెప్పారు.

ఎమ్మెల్యే, విప్ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, తిరుమల తరహాలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలో జీర్ణావస్థకు చేరిన 44 ఆలయాలకు శ్రీవాణి ట్రస్ట్ నుంచి ఇటీవల రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అనంతరం ఆలయంలో రూ.3.75 కోట్లతో నిర్మించిన ప్రాకార మండపాన్ని మంత్రి సత్యనారాయణ ప్రారంభించారు. రూ.1.35 కోట్లతో నిర్మించనున్న ఎస్ఎస్ క్యూలైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

1,700 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం



గోడౌన్‌లో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న జక్కంపూడి కిరణ్

అమలాపురం టౌన్: స్థానిక నల్లా వీధిలోని తటవర్తి మల్లికార్జునరావుకు చెందిన అనధికార రైస్ గోడౌన్‌ను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా పంపిణీకి ఉపయోగించే 1,700 కేజీల రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని గోడౌన్‌లో గుర్తించారు. ఈ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడమే కాకుండా, రీ సైకిలింగ్ చేస్తూ 25 కేజీల చొప్పున సంచుల్లో వేసి, అమ్మేస్తున్నారని గమనించారు. మల్లికార్జునరావుకు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపాన మెయిన్ రోడ్డు చెంతన లక్ష్మీ సాయి రైస్ అండ్ జనరల్ స్టోర్స్ ఉందని కిరణ్ తెలిపారు. ఆ షాపునకు అనుసంధానంగా అక్రమ బియ్యం దాచేందుకు ఈ అనధికార గోడౌన్ నిర్వహిస్తున్నారని చెప్పారు. పట్టుబడిన 1,700 కేజీల రేషన్ బియ్యాన్ని మండల పౌర సరఫరా అధికారి భారతి, వీఆర్ఓ శ్రీనివాసరావు సమక్షంలో స్వాధీనం చేసుకుని, అంబాజీపేట మండల లెవెల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్‌కు తరలించారు.